# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 01-12-2016**

విద్యుత్ శాఖలోని ట్రాన్స్కో, జెన్కో, డిస్కమ్ లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులదరినీ దశల వారీగా రెగ్యులరైజ్ చేసే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అధికారులను ఆదేశించారు. కాబట్టి విద్యుత్ ఉద్యోగుల సంఘాలు వెనువెంటనే సమ్మె పిలుపును ఉపసంహరించుకుని చర్చలకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. చాలా ఏళ్లుగా తక్కువ జీతాలతో విద్యుత్ శాఖలో సేవలందిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మానవతా దృక్పథంతో క్రమబద్ధీకరించాలని సిఎం అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించి విధివిధానాలు రూపొందించాలని కూడా చెప్పారు. విద్యుత్ ఉద్యోగులు ఇచ్చిన సమ్మె పిలుపును ఉపసంహరించుకుని శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డితో సమావేశమయి చర్చించుకుని, సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. గతంలో విద్యుత్ ఉద్యోగులకు జీతాలు పెంచామని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు కూడా భారీగా పెంచామని, అదే తరహాలో విద్యుత్ శాఖ ఉద్యోగులకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని సిఎం ప్రకటించారు.

విద్యుత్ శాఖ ఉద్యోగులకు సంబంధించిన అంశాలపై ప్రగతి భవన్ లో గురువారం సిఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి, జెన్కో సిఎండి డి. ప్రభాకర్ రావు, టిఎస్ఎస్పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి, టిఎస్ఎన్పిడిసిఎల్ సిఎండి గోపాలరావు, విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ మిశ్రా, సిఎంఓ ముఖ్యకార్యదర్శి నర్సింగరావు, అదనపు ముఖ్య కార్యదర్శి శాంతకుమారి పాల్గొన్నారు.

జెన్కో సిఎండి ప్రభాకర్ రావు, ఇతర అధికారులు విద్యుత్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిమాండ్లను ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. సబ్ స్టేషన్ల నిర్వహణ, లైన్ల నిర్వహణ, ప్లాంట్ల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ లాంటి కీలక విభాగాల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారని, వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్ ఉందని ముఖ్యమంత్రికి విన్నవించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తక్కువ వేతనాలతో సేవలందిస్తున్నారని, విద్యుత్ శాఖకు ఏండ్ల

తరబడి సేవలందించారని సిఎం అన్నారు. అలాంటి ఉద్యోగులు అనుభవం కూడా గడించారని, మానవతా కోణంలో పరిశీలించి వారిని దశలవారీగా రెగ్యులరైజ్ చేయాలని సిఎం అన్నారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం మొదటి నుంచి సానుకూలంగా స్పందిస్తున్నదని, ఏ సమస్య ఉన్నప్పటికీ పరిష్కరించుకునే అవకాశం ఉందని, సమ్మెలు అవసరం లేదని సిఎం అన్నారు.

రాజకీయ కారణాలతో చేసే సమ్మెలో భాగస్వామ్యం కాకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించకుండా సమ్మె పిలుపును ఉపసంహరించుకోవాలని కోరారు.

సమ్మె ఉపసంహరణ ప్రకటన జరిగిన వెంటనే ఉద్యోగ సంఘాల నాయకులను చర్చలకు పిలువాలని మంత్రి జగదీష్ రెడ్డిని సిఎం ఆదేశించారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని కూడా మంత్రిని సిఎం కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాలు సంతోషంగా, సంతృప్తిగా ఉండాలని అటువంటి ఆరోగ్యకరమైన తెలంగాణయే లక్ష్యమని సిఎం చెప్పారు.

సిపిఆర్ఓ టు సిఎం